క్లుప్తంగా

సుబ్బారెడ్డికి అభినందనలు వెల్లువ



సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికకానున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. విశాఖలోని పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు ఆయనను శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గరిష్ట వేతనం అందేలా పనులు చేయించాలి



వేతనదారుల మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: ఉపాధి వేతనదారులకు గరిష్ట వేతనం అందేలా వారితో పనులు చేయించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై ఉందని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు అన్నారు. మండలంలోని గిట్టుపల్లి గ్రామంలో ఉపాధి పనులను శని వారం ఆయన పరిశీలించారు. వేతనదారుల మస్తర్ల సీట్లను తనిఖీ చేసి వారికి పలు సూచనలు చేశారు. నిబంధనల కు అనుగుణంగా పని చేయాలని, జాబ్ కార్డు ఉన్నవారే పనికి హాజరు కావాలని చెప్పారు.

ఉత్సాహంగా గుర్రాల పరుగు పందెం



పరుగు తీస్తున్న గుర్రాలు

వేపాడ: మండలంలోని జాకేరులో వీరాంజనేయ, చిన్నమ్మ, పైడమ్మ పేరంటాల తీర్థం సందర్భంగా శనివారం నిర్వహించిన గుర్రాల పరుగు పందాలు అలరించాయి. సర్పంచ్ బుద్దా చిన్నమ్మలు, అప్పలనాయుడు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్ చినరాము నాయుడు పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. ఈ పోటీలో 13 గుర్రాలు పాల్గొనగా.. రామన్న పాలెంనకు చెందిన చోడమాంబ విక్రమ్ గుర్రం ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే కొట్యాడకు చెందిన సింగపూర్ సత్యనారాయణ ఠాగూర్ గుర్రం రెండో స్థానంలో, హనుమంతురావు గుర్రం మూడో స్థానంలో నిలిచింది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐ నవీన్‌పడాల్‌ను సన్మానిస్తున్న నాయకులు, సీఐ ఉపేంద్రరాయ్

మెరకముడిదాం: మండలంలోని బుధరాయవలస పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేసిన ఎస్‌ఐ సీహెచ్ నవీన్‌పడాల్‌కు, హెడ్‌కానిస్టేబుల్ అప్పారావు బదిలీ అయ్యారు. వీరిని పోలీస్ స్టేషన్‌లో పోలీసు సిబ్బంది, మండల ప్రజాప్రతినిధులు,నాయకులు శనివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో చీపురుపల్లి సీఐ హెచ్.ఉపేంద్రరాయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు, స్థానిక సర్పంచ్ సారిక తమ్మినాయుడు పాల్గొన్నారు.

ఈఈఎంటీ పరీక్షలో కుమరాం విద్యార్థిని ప్రతిభ



కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సురేష్ కుమార్ చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థిని శరణ్య

జామి: ఏపీ విద్యాశాఖ, ఏపీ ఫణి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన మెరిట్ టాలెంట్ టెస్ట్‌లో కుమరాం ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థిని రాయవరపు శరణ్య రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. శని వారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని శరణ్యకు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఎస్.సురేష్ కుమార్ ప్రశంసాపత్రం,జ్ఞాపిక అందజేశారు.పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.పద్మావతి,గైడ్ టీచర్ ఏ.వి.రమణరాజు తదితర ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య

వారధులు వలంటీర్లు

- ప్రజలకు సేవ చేయడం వరం
- వలంటీర్ల సేవలకు సలామ్
- వలంటీర్లకు 'వందనం'లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి



గుర్ల: వలంటీర్లను సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, తదితరులు



జామి: సేవారత్న అవార్డులు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

గుర్ల: గ్రామవలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులని, ప్రజల చెంతకు సంక్షేమాన్ని చేరవేసే నిస్వార్థ సేవా సైనికులని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమం లో భాగంగా మండలంలోని 388 మంది వలంటీర్లను స్థానిక వెంకట అమ్మాజీ కల్యాణ మండపంలో శనివారం సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం వరమని, అ లాంటి సేవలను అందిస్తున్న వలంటీర్లకు ఎంతైనా రుణపడి ఉంటామన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలపై ప్రజలకు మరింత వివరించాలన్నారు. ప్రజాప్రతినిధుల కంటే ఎక్కువ గౌర వం వలంటీర్లకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్నారని, అందుకే ఏటా వలంటీర్లకు వందనం పేరిట వలంటీర్లను సత్కరిస్తూ, ప్రోత్సాహకాలు అందిస్తున్నారన్నారు. ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగా రునాయుడు, ఎంపీడీఓ వెంకటరమణ,ఈఓపీఆర్డీ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



జామి: జామిలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

జామి: గ్రామ వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణ లో వలంటీర్లకు వంద నం కార్యక్రమం శనివారం నిర్వ హించారు. వలంటీర్లను సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, లంచాలకు తావు లేకుం డా ప్రజలకు పథకాలు, ప్రభుత్వ సేవలు అందించాలనే లక్ష్యం తోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని అన్నారు. సీఎం జగన్ లక్ష్యాలు, ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు పని చేస్తున్నారన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్ పాలనలో సాకారమైందన్నారు. వలంటీర్లు పారదర్శకంగా సేవలు అందిస్తుంటే చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు వలంటీర్ వ్యవస్థపై ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. దేశంలోనే అతి గొప్పవ్యవస్థ వలంటీర్ వ్యవస్థ అని కొనియాడారు.టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను తొలగిస్తామని అనేకసార్లు ఆపార్టీ అధినేత చంద్రబాబునాయుడుతో పాటు, ఆపార్టీ నాయకులు అన్న మాటలను గుర్తు చేశారు.ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, జేసీఎస్ మండల కన్వీనర్ శీరెడ్డి చందునాయుడు,ఎంపీడీఓ తిరుమలరావు,పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఎవరు అవినీతిపరులో ప్రజలకు తెలుసు

- టీడీపీ హయాంలో అంతా అవినీతిమయమే
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కడుబండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జామి: పచ్చకామెర్లు ఉన్న వారికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందన్నట్లు, టీడీపీ నాయకులు ఇతరులను కూడా వారి మాదిరిగా అవినీతిపరులని అనుకుంటున్నా రని, ఎవరు ఎలాంటి వారో ప్రజలకు బాగా తెలుసని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ పాల న అంతా అవినీతిమయమేనని, దోచుకోవడం,దాచుకోవడమే లక్ష్యంగా పాలన సాగించారని ఆరోపించారు. తాను ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చా నని, తాను ఎటువంటి సేవలు అందిస్తున్నానో, ఎలాంటి వాడినో నియోజకవర్గ ప్రజలను అడిగితే తెలుస్తుందన్నారు. నారా లోకేష్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే లలితకుమారి తనపై చేసిన అవినీతి ఆరోపణలను ఎమ్మెల్యే ఖండించారు. ఎస్.కోట నియోజకవర్గంలో టీడీపీ హయాంలో లలితకుమారి ఏవిధంగా అవినీతి చేశారనేది నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసుని అన్నారు. వారు చేసిన అవినీతి, అక్రమాలను తమపై మోపుతున్నారని మండిపడ్డారు. నీరు చెట్టు పేరిట ప్రజాధనాన్ని దోచుకున్నారని, జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తే కాని ప్రజలకు పథకాలు అందించే వారు కారని గుర్తు చేశారు. అవినీతి రహిత పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై, తమపై ఆరోపణలు చేయడం తగదన్నారు. పరిపాలనలో సీఎం జగన్ అనేక సంస్కరణలు తీసుకువచ్చారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయంలో పేదలు హాయిగా ఉన్నారని అన్నా రు. ఒక్క పైసా అవినీతి లేకుండా పాలన సాగుతుంటే చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ టీడీపీకి బుద్ధి చెప్పేం దుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఎంపీపీ సబ్బవరపు అరుణ,జెడ్పీటీసీ గొర్లె సరయు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, జేఏసీ మండల కన్వీనర్ శీరెడ్డి చందునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు పిన్నింటి రవికుమార్, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, నాయకులు కరక దశరథ, తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ

వేపాడ: వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా వల్లంపూడి సచివాలయంలో లబ్ధిదారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామని, నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. పంచాయతీలో జగనన్న లేఅవుట్‌లో 69, సొంత స్థలాలు ఉన్న వారికి 46 గృహాలు మంజూరు చేయగా 59 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగతావి త్వరగా పూర్తి చేసేలా లబ్ధిదారులను సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్, వలంటీర్లు చైతన్యపరచాలని, గృహనిర్మాణ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఏఈ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మండల వైఎస్సార్‌సీపీ కార్యదర్శిగా అప్పలస్వామి



జె. అప్పలస్వామి

లక్కవరపుకోట: ఎల్. కోట మండల వైఎ స్సార్‌సీపీ కార్యదర్శిగా రెల్లి గౌరమ్మపేట గ్రామానికి చెందిన జవ్వాది అప్పలస్వామిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. అప్పలస్వామికి మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ, జెడ్పీటీసీ తూ ర్పాటి వరలక్ష్మి, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు తదితరులు అభినందనలు తెలిపారు.

ఉపాధి వేతనదారులతో ముఖాముఖి



పల్లపు దుంగాడ ప్రజలతో మాట్లాడుతున్న ఏపీడీ శారదాదేవి

శృంగవరపుకోట: మండలంలోని దారపర్తి పంచాయతీకి చెందిన పల్లపు దుంగాడ గిరిజన గ్రామంలో ఉపాధి వేతనదారులతో ఏపీడీ ఎస్. శారద, ఏపీఓ కె. తిరుపతి, తదితరులు శనివారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి జీవన విధానం, ఉపయోగపడే పనులు చేపట్టడం, తదితర అంశాలపై చర్చించారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనులపై యాక్షన్ ప్లాన్ తయారు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ రమ్య, జేఈ కె.అప్పారావు, టీఏలు రామారావు రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్లు సన్యాసిరావు, పి. భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శృంగవరపుకోట: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్, మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శిశు అభివృద్ధి పథకం అధికారి ఎం .ఉమా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.కోట మొండివీధి అంగన్‌వాడీ కేంద్రంలో ఏడబ్ల్యూహెచ్‌ఎస్ పోస్టు ఓసీ కేటగిరీకి, కురిడి అంగన్‌వాడీ కేంద్రం మినీ కార్యకర్త పోస్టు కూడా ఓసీ కేటగిరీకి కేటాయించినట్లు పేర్కొన్నారు. 23 జూలై ఒకటో తేదీ నాటికి 21 నుంచి 35 ఏళ్ల లోపు వయసుండి, పదో తరగతి పాస్ కావాలన్నారు. ఈ నెల 19 నుంచి 24 లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సౌకర్యాలు పరిశీలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుదర్శన్

దత్తిరాజేరు: పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని తహసీల్దార్ సుదర్శన్ అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రూట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరచూ కేంద్రాలను పరిశీలించడం వల్ల తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాల పరిస్థితిని తెలుసుకోవచ్చన్నారు. సమస్యలుంటే వెంటనే పరిష్కరించుకునే వెసులుబాటు కలుగుతుందని చెప్పారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ: మండలంలో ఖాళీగా ఉన్న రెండు గ్రామ వలంటీర్ పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ జి.ఉమ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జగ్గయ్యపేటలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టును బీసీడీ జనరల్‌కు గుడివాడలో ఖాళీగా ఉన్న పోస్టును ఎస్సీ జనరల్‌కు కేటాయించినట్లు పేర్కొన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులై, అదే గ్రామానికి చెందిన 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు ఈ నెల 19వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కార్యదర్శుల్లో ఆనందం



ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును సత్కరిస్తున్న సచివాలయం గ్రేడ్-5 కార్యదర్శులు

జామి: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-1, గ్రేడ్-4 మాదిరిగా అధికారాలు, విధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి కృతజ్ఞతగా సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును శనివారం సత్కరించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖమంత్రి బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతి,అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ టీడీపీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- లోకేష్, కె.ఏ.నాయుడు మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది
- కె.ఏ.నాయుడు చేసిన దోపిడీ, అక్రమాలను ప్రజలు ఇంకా మరచిపోలేదు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ తెలుగుదేశం పార్టీ అని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గంట్యాడ మండలంలో నిర్వహించిన శంఖారావం సభలో నారా లోకేష్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే కె.ఏ.నాయుడు మాట్లాడిన మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. లోకే ష్, కె.ఏ.నాయుడు ఆరోపణలను ఖండించారు. గజపతినగరం నియోజకవ ర్గంలో తాను భూకబ్జాలు చేస్తున్నానని, ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలను ఎమ్మెల్యే తప్పుపట్టారు. గజపతినగరంలో తనకంటూ ఒక పార్టీ కార్యాలయం ఉందని, అసలు కె.ఏ.నాయుడుకు గజపతినగరంలో కార్యాలయం ఉందా అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కె.ఏ.నాయుడు ఉద్యోగాల పేరిట లంచా లు తీసుకునేవాడని, మట్టి, ఇసుక,గ్రావెల్ అక్రమంగా అమ్ముకుని, దోపిడీ పాలన చేశారని, అది ఇంకా ప్రజలు మరిచిపోలేదన్నారు. తనకు 500 ఎకరాల భూమి ఉందని టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, వారు చేస్తు న్న ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల ను వదిలేస్తానని, నిరూపించలేకుంటే లోకేష్, కె.ఏ.నాయుడు రాజకీయాలు వదులుకుంటారా అని ఎమ్మెల్యే అప్పలనరసయ్య సవాల్ విసిరారు. రెండెకరాల భూమి ఉన్న చంద్రబాబు నాయుడుకు ఇప్పుడు ఇంత ఆస్తి, లక్షల ఎకరాల భూమి ఎలా వచ్చిందో లోకేష్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇసుక దందా, రోడ్లు వేయకుండా బిల్లులు చేసుకోవడం, బినామీల పేరిట భూములు సంపాదించుకున్న కె.ఏ. నాయడు లాంటి వారి కూడా సిగ్గు లేకుం డా నీతి కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. జిల్లాలో గిరిజన యూనివర్శిటీ, ఇంజినీరింగ్, వైద్యకళాశాలల ఏర్పాటు, ఆస్పత్రులు, పాఠశాలల అభివృద్ధి, తదితర ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిందని, టీడీపీ హయాంలో ఏం చేశా రో సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే అప్పలనరసయ్య ప్రశ్నించారు.భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని టీడీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తే, దానికి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు తాము ప్రయత్నం చేస్తున్నానమి చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, సీనియర్ నేతలు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కె.సుబ్రహ్మణ్యం, గార రాజు తదితరులు పాల్గొన్నారు.

మెగాలోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



పోలీసులు, న్యాయవాదులతో సమావేశమైన జడ్జి కనకలక్ష్మి

గజపతినగరం: స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో మార్చి 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్ ను విజయవంతం చేయాలని ఆ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి కోరారు. స్థానిక కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకునేందుకు వీలున్న సివిల్,క్రిమినల్,తదితర కేసులను పరిష్కరిస్తామని చెప్పారు. కక్షిదారులకు అవగాహన కల్పించి, ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషిచేయాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో రాజీపడడానికి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ మంచి వేదిక అన్నారు. న్యాయవాదులు, పోలీసులు సహకరించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

అక్రమార్కులకు అడ్డాగా జనసేన

- దందాలపై మాట్లాడే అర్హత వారికి లేదు
- వైఎస్సార్‌సీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: భూ ఆక్రమణలకు పాల్పడేవారితో పాటు సెటిల్‌మెంట్ దందాలు చేసే వారికి జనసేన పార్టీ ఆశ్రయం కల్పించి, పదవులు ఇస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. చీపురుపల్లి నియోజకవర్గ జనసేన నాయకుడిగా చలామణి అవుతున్న వ్యక్తి కూడా అలాంటి వాడేనని స్పష్టం చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోరుకొండ దాలయ్య, కొసిరెడ్డి రమణ మాట్లాడుతూ.. చీపురుపల్లి జనసేన నాయకుడు విజినిగిరి శ్రీనివాసరావు చాలా అక్రమాలు చేశాడని ఆరోపించారు. గ్రామ కంఠం, దేవదాయ శాఖ భూములు, గెడ్డ పోరంబోకు స్థలాలు ఆక్రమించుకుని తప్పుడు రిజిస్ట్రేషన్లతో ప్రజలను మోసం చేసిన సంగతి ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. జి.అగ్రహారంలో ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు చెందిన జిరాయితీ భూమిని, బ్రాహ్మణవీధిలో 51 సెంట్ల గ్రామకంఠం భూమి, ఆర్‌అండ్‌బీ బంగ్లాకు చెందిన 48 సెంట్లు, 1.53 ఎకరాల దేవదాయశాఖ భూమి ఆక్రమించి, తప్పుడు నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేయించాడని ఆరోపించారు. అంతేకాకుండా అగ్రహారం రెవెన్యూ పరిధిలో 90 సెంట్ల గెడ్డ పోరంబోకు భూమిని కూడా ఆక్రమించుకున్నాడన్నారు. ఇలాంటి అక్రమాలపై కేసులు నమోదైతే వాటిని వైఎస్సార్‌సీపీ నాయకులే పెట్టారని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో దీనుపల్లి రాము, రౌతు పైడిరాజు, మహేష్, సిమ్మాల అప్పన్న, డబ్బాడ జగన్నాథం, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఆరోపణలు సిగ్గు చేటు



మాట్లాడుతున్న జైహింద్‌కుమార్

గంట్యాడ: అవినీతికి కేరాఫ్ అడ్రస్ అయిన టీడీపీ నాయకులు... నిజాయితీపరుడైన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యపై నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గు చేటు అని జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులు నుంచి డబ్బులు దండుకున్న వ్యక్తి టీడీపీ మాజీ ఎమ్మెల్యే కె..ఏ.నాయుడు అని ఆరో పించారు. టీడీపీ తనకు ఎమ్మెల్యే టికెట్టు ఇస్తుందో లేదోనన్న ఆందోళనలో కె.ఏ.నాయుడు ఏది పెడితే అది మాట్లాడుతున్నాడని విమర్శించారు. టీడీపీ హయాంలో పేదలకు తెల్లరేషన్ కార్డులు ఇవ్వడానికి కూడా జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు లంచాలు వసూలు చేసేవారని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టించే విధంగా టీడీపీ నాయ కులు వ్యవహరిస్తున్నారని జైహింద్‌కుమార్ మండిపడ్డారు. 2014 ఎన్నికల సమయంలో జాబు రావాలంటే బాబు రావాలని చెప్పి యువతను, రైతు, డ్వాక్రా రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులు, మహిళలను చంద్రబాబునాయుడు నట్టేట ముంచారని, అబద్ధాలు, మోసాలకు టీడీపీ నాయకులు బ్రాండ్ అంబాసిడర్లని ఎద్దేవా చేశారు. మండలంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య పేరు మీద ఒక్క ఎకరం భూమి అయినా ఉన్నట్లు నిరూపిస్తే టీడీపీ నాయకులకే రాసి ఇచ్చేస్తామని సవాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు లచ్చి రెడ్డి కృష్ణ, గజపతినగరం నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జాగరపు అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు కండల విజయ్‌కుమార్, బొత్స ప్రసాద్, చాప సీతారాం పాల్గొన్నారు.